వెలువడింది!    సరికొత్త ప్రచురణ!

రసికజన మనోభిరామము
అను
$N_2O$

జ్యోతి జోక్సువారి హాస్యరస ప్రధానమైన ప్రబంధరాజం కొత్తగా వెలువడింది. ఆహ్లాదకరమైన ముఖచిత్రంతో, పుటపుటకు నవ్వించే కార్టూన్లూ, ఛలోక్తులతో రసిక పాఠకజన మనోభిరామంగా ప్రచురింపబడిన ఈ పుస్తకం అందరు తప్పక చదవదగినది.

నేడే మీ ప్రతికి ఆర్డరివ్వండి. లేదా
"జ్యోతి" ఏజెంట్స్ ద్వారా తెప్పించుకోండి.

వెల : రూపాయి,    పోస్టేజితోసహా రూ. 1–68.

ప్రతులకు : జ్యోతి బుక్స్, విజయవాడ-2.

"చనువు తీసుకుని అంటూన్నందుకు మీరు ఏమీ అనుకోవద్దు. పెద్దావిడ, అమ్మగారి కోరిక తీర్చండి. మీరు వివాహం చేసుకోండి" అంది జ్యోతి.

నవ్వి అన్నాడు రమేష్ "మీకు అమ్మ, నిర్మల విషయం చెప్పిఉండవచ్చు. నిర్మల పోలికలు ఉన్న యువతి నాకు కనుపించటం లేదు."

"నిర్మల పోలికగల అమ్మాయిఉంటే వివాహం చేసుకుంటారా" అని అడిగింది జ్యోతి.

"తప్పక చేసుకుంటా కాని, ఆ అమ్మాయికి నేను నచ్చవద్దూ" అన్నాడు నవ్వుతూ రమేష్.

జ్యోతి మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వింది.

"మీ సంగతి నాకు అమ్మ చెప్పింది మీరు యిక్కడకు వచ్చిన వెంటనే చెప్పివేస్తే అమ్మ తప్పక మీ బావగారితో మీ వివాహం జరిపించిఉండేది" అన్నాడు రమేష్

"అవన్నీ మరచిపోవటం మంచిది. ఆ జన్మ వేరు. నాకు మీరు పునర్జన్మ ప్రసాదించారు" అంది జ్యోతి తలవంచుకొని.

"మీలో నిర్మల పోలికలు చాలా ఉన్నాయి. అమ్మతోగూడా రెండుసార్లు అన్నాను. మిమ్మల్ని చూస్తే నిర్మలను చూసినట్లుగా ఉంటుంది" అన్నాడు బాధగా నిట్టూర్చి.

"నిర్మలలేని స్థానంలో నన్ను నియమిస్తారా ?" అడిగింది జ్యోతి.

"జ్యోతీ...." అన్నాడు రమేష్, ఆనందంగా.

"అవును. నిర్మలలేని లోటు తీర్చటానికి ప్రయత్నిస్తా" అంది జ్యోతి.


"జ్యోతీ, నీవుమాయింటికి వచ్చినప్పుడు నిర్మల తిరిగి వచ్చిందా అనుకుని ఆనందించాను. నీతో ఎన్నో సార్లు చెబుదామనుకున్నాను కాని చెప్పలేకపోయాను.

భగవంతుడే నిర్మల రూపంలో నిన్ను నాదగ్గరకు పంపాడేమో" అని ఆనందంతో ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

రమేష్ పాదాలను కళ్ళకద్దుకుని నమస్కారం చేసింది జ్యోతి. ▢▢▢

# అతనికంటె ఘనుడు

వాళ్ళిద్దరికీమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఆబాల గోపాలానికి తెలుసును. అయితే నిజంగా పచ్చగడ్డి తీసుకువెళ్ళి వాళ్ళిద్దరిమధ్యాన వేసి, అప్పుడు వచ్చినమంటని చూశామనిచెప్పిన వాళ్ళెవరూ లేరు కాని, మంట వచ్చి తీరుతుందని మాత్రంనిస్సందేహంగా యావన్మందీ చెప్తారు.




అందుకే రామనాథానికి గోపాలం కొంత సొమ్ము నోటుమీద ఇచ్చాడన్నా, గోపాలం వద్దకు రామనాథం సొమ్ము కావాలంటూ వెళ్ళి, నోటువ్రాసి యిచ్చి ఆసొమ్ము తెచ్చుకున్నాడని ఆ సమయంలో అక్కడున్న వాళ్ళు, సాక్షిత్తూ ఆ నోటు మీద సాక్షి సంతకం చేసినవాళ్ళు చెప్పినా కాని నమ్మలేక పోయారెవ్వరూ.

ఎవరు నమ్మినా, ఎవరు నమ్మకపోయినా అలా జరిగిన విషయంమాత్రం నిజం.

అసలు రామనాథానికి, గోపాలానికి చుక్కెదురు. ఆ వైరం కేవలం వాళ్ళ స్వార్జితమే కాదు. పిత్రార్జితమూను. వాళ్ళ తండ్రుల కూడా ఒకరంటే ఒకరికి పడేది కాదు. దాని క్కారణం ఇద్దరూ ఒక్క వ్యాపారంలోనే ఉండటమే; యాచకుడికి యాచకుడు శత్రువవు తాడన్నది సామెత ఇద్దరూ వడ్డీ వ్యాపారమే చేస్తూండటం, సదరు వ్యాపారానికి ముడి పదార్థమైన ఋణ గ్రహీతలు బహు కొద్దిమంది కావటం, ఆ కొద్దిమంది అవసరాలమీదే ఆధారపడి వాళ్ళిద్దరూ తమతమ భవిష్యత్తులను నిర్మించుకోవలసి రావటం కారణాలుగా ఒకరి చేష్ట మరొకరికి నచ్చక అంతకంతకు వైరం పెరిగిపోయింది. అవతారాలు చాలించేముందు తమ వంశాంకురాలను పిలిచి, చెవిలో వైనం యావత్తూ ఊదేసి, తమ పరువు ప్రతిష్ఠలను యధాతథంగా కాపాడవలసినదని ఒకసారికి పదిసార్లు హెచ్చరించి, మరీ కన్నుమూశారని వినికిడి. అనాటినుంచీ రామనాథం, గోపాలంకూడా పితృవాక్య పరిపాలనా దక్షులు గనుక పిత్రార్జితమైన ఆ వైరాన్ని అలానే పెంపొందించుకుంటూ తమస్వశక్తిని వృద్ధిచేసుకుంటూ వస్తున్నారు.

అలాగని వాళ్ళిద్దరూ వీధినపడి కొట్టుకున్న సందర్భమూలేదు; పోనీ ఏసావిట్లోనో పేచీపడ్డ జాడాలేదు; కనీసం వాగ్యుద్ధమైనా చేసినట్లూ వినలేదు. వారికి జరుగుతున్నది ఇప్పటి రాజకీయ భాషలో చెప్పాలంటే ప్రచ్ఛన్నయుద్ధం. ఈయుద్ధాని కాహుతయేది. నష్టపోయేది ఇటునుంచి అటు, అటునుంచి ఇటు మూటలు మోసే మధ్యవర్తులు మాత్రమే కాని, వాళ్ళిద్దరూ మాత్రంకాదు. అలాగని వాళ్ళిద్దరూ మాట్లాడుకున్న సందర్భమూ లేదు.

ఇలా ఉండగానే ఒకానొకరోజున తెల్లవారగానే రామనాథం గోపాలం యింటికి వచ్చాడు. వస్తూనే "గోపాలంగారూ!" అని ఆప్యాయంగా పిలిచాడు కూడా.

రెండో డోసు కాఫీ చప్పరిస్తున్న గోపాలం లోపల్నుంచే "ఎవరు వారూ?...." అంటూ వీధిలోకి వచ్చాడు. వస్తూనే తన గుమ్మంలో నుంచున్న రామనాథాన్ని చూసిన గోపాలానికి అప్పుడే త్రాగిన గ్రుక్కెడు కాఫీ గుటకా పడక, బయటకూ రాక ఒక్క క్షణం తటపటాయించింది. ఎలాగో గుటక వేసి, నిళ్ళునములుతూ, "దయచెయ్యండి! దయచెయ్యండి! ఎంత దయ!.... ఎంత అదృష్టం! మీరు మా యింట్లో అడుగు పెట్టటం - నిజంగా నా అదృష్టం.... అమ్మాయ్! రామనాథంగారు వచ్చారు - కాఫీ తెచ్చిపెట్టమ్మా!...." అని అరుస్తూనే "నుంచునే పోయారు....రండి! కూచోండి. ...." అన్నాడు.

రామనాథం మాత్రం ఏం తక్కువ తిన్నాడని? "ఫరవాలేదు. వస్తానండి!.... ఇంతవరకూ వచ్చాక లోపలకి రాకుండాను; కూచోకుండాను వెళ్ళనుగా!...." అన్నాడు అక్కడే ఉన్న కుర్చీలో కూచుంటూ.

"ఏమే! అమ్మాయ్! కాఫీ తేలేదు...." అని మరోసారి లోపలకి కేక వేశాడు గోపాలం.



"నేను కాఫీ త్రాగేవచ్చానండీ!.... అనవసరంగా వారిని ఇబ్బందిపెట్టకండి!...." అన్నాడు మర్యాదగా రామనాథం.

"మాబాగా అన్నారు కాదూ! మీకు లేదా, పోనీ! మీరు త్రాగలేదా? మా ఇంటికి వచ్చారు. ఇది నాకర్తవ్యం! అంతే! ఇంక మీరేం అనవద్దు!...." అని అప్పుడే కూతురు తెచ్చిన కాఫీగ్లాసు రామనాథానికి అందించాడు గోపాలం.

"సరే! మీ ఇష్టం!...." అని అందుకున్నాడా గ్లాసు నతడు.

ఇద్దరూ కాఫీ త్రాగుతున్నారన్నమాటే గాని, ఏ ఒక్కరి దృష్టీ కాఫీమీద లేదు.

తనకి బద్ధశత్రువైన రామనాథం, తన పేరు చెవితేనే మండిపడి నానామాటలూ అనే రామనాథం ఈరోజు ఇలా తనయింటికి యెందుకొచ్చాడో ఎంత ఆలోచించినా అంతు చిక్కటంలేదు గోపాలానికి.

తను వచ్చేటప్పటికి యింత ఆదరణ, అభిమానమూ గోపాలం చూపిస్తాడని కలలో కూడా అనుకోని రామనాథంకూడా కొంచెం ఖంగారు పడ్డాడు.

మధ్యమధ్య ఒక్కొక్క గుక్కెడు కాఫీ చప్పరిస్తూ పొడిపొడిగా ఏదో సంభాషణ ఎందునా పొందని విషయాలను గురించి సాగిస్తున్నారుగాని, ఆ సంభాషణపట్ల ఇద్దరికీ శ్రద్ధా లేదు; ఆసక్తీలేదు.

చిట్టచివరకు కార్యార్థియై వచ్చినవాడు కనక రామనాథమే అన్నాడు-"నేను మీతో కొంచెం పనుండి వచ్చాను" అని.

"ఎంతమాట! నాతో మీకు పనా? అందుకు మీరు రావాలా? కాస్త కబురుచేస్తే రెక్కలు కట్టుకు వాలకపోయానా - మీ యింట్లో?...." అన్నాడు గోపాలం.

"అవుననుకోండి! మని ద్దరికీ అటువంటి ఇదేమీలేదు ...కాని. అవసరం నాదికాదా! అందుకని నే రావటమే ధర్మం!" అన్నాడు రామనాథం

"అదంతా మీ అభిమానం. నా అదృష్టమూను.... కనుకనే మీకు నామీద ఇంత దయ కలిగింది. ఇంతకీ నేను మీకు చెయ్యగలిగేది—"

"ఉంది!....కనుకనే నేను రావల్సివచ్చింది. మీకైతే అదొక పెద్ద యిదికాదు గాని, నాకుమాత్రం మహోపకారం అవుతుంది. ఇప్పటి నా యీ స్థితిలో... "

"చెప్పండీ! మీకు ఉపకారం చెయ్యగలిగితే అంతకంటెనే కోరుకునే దేముంటుంది? చెప్పండి?...." అన్నాడు గోపాలం.

అన్నాడే కాని రామనాథం ఏమి అడగబోతున్నాడో ఊహించలేక పోయాడు. ఎంతగా సతమతమైనా. అంతలోకి రామనాథమే బయట పెట్టాడు - చల్లగా.

"అర్జంటుగా ఓ పదివేలు రొక్కంకావలసివచ్చింది. సమయానికి చేతిలో లేకపోయింది. తప్పనిసరిగా కావాలి! ఏం చెయ్యాలో తెలవలేదు. సరే! మీదగ్గర కొస్తే సర్దుతారు గదా అని వచ్చాను! మీ రీ సాయం చేశారంటే జన్మ జన్మలకి ఋణపడి ఉంటాను - మీకు. మీకిదో లెక్కలోది

# మధిర భానుమూర్తి

కాదు. కాని నాకుమాత్రం గొప్ప సహాయమవుతుంది. నోటు వ్రాసి యిస్తాను...." అన్నాడు రామనాథం బ్రతిమలాడుతూ.

"ఇంకా నయం! మీవంటివారు అడగటం, నేను కాదనటమూనా? అయితే అంత రొక్కం ఉందా? లేదా? అనిగాని.... అయితేనేం? నాదగ్గర లేకపోతే ఎక్కడో ఒకచోట తెస్తాను-ఇస్తాను.... మీ అవసరమొకటీ, నా అవసరమొకటీనా?" అన్నాడు గోపాలం.

రామనాథం తనని బదులు అడగటంలోని అంతర్యం ఏమిటా అని కాస్సేపు తర్జన భర్జన చేసుకున్నాడు కాని, ఎలాగూ నోటు వ్రాయించి పుచ్చుకునేటప్పుడు తనకింకేం భయముండదని, పైగా ఆ రామనాథంగాడి జుట్టు ఈ విధంగా తన చేతిలో చిక్కినట్లయితే వాణ్ణి ఒక ఆట ఆడించి తరతరాలుగా వస్తున్న తన కక్షను సాధించవచ్చునని ఆశించి, అంగీకరించాడు గోపాలం.

నెలకి నూటికి రెండు రూపాయలు, రెండున్నర వడ్డీకి తనని బ్రతిమిలాడి పట్టుగెళుతున్నారని, రామనాథం వంటివాడు వచ్చి అడిగాడు గనక రూపాయన్నరచేసి ఇస్తానని, మూడేళ్ళ కయ్యే వడ్డీ మినహాయించుకుని మిగిలినదే ఇవ్వటం మామూలేనని గోపాలం చెప్పిన షరతులకు వెంటనే అంగీకరించాడు రామనాథం.

రామనాథం స్వదస్తూరీని ప్రోనోటు వ్రాశాడు. వ్రాస్తూ, వ్రాస్తూ సగంలో ఆగిపోయాడు: "అయ్యో! చిన్నపొరపాటు జరిగిపోయింది. ఇవాళ జనవరి 24 కాదూ? పొరపాటున 23 అని వ్రాసేశాను...పోనీ దిద్దమంటారా? అన్నాడు.

ప్రోనోటుమీద దిద్దుబాటులు, తుడుపులు ఎందుకులెమ్మనీ, అంతకన్న ముఖ్యంగా ఆ రోజు పుచ్చుకున్న సొమ్ముకి అంతకు ముందురోజునుంచి వడ్డీ వస్తుంది గదా అని ఆలోచించినవాడై "ఫరవాలేదు. అలా ఉంచెయ్యండి! దిద్దటమెందుకు?...." అన్నాడు గోపాలం.

"అల్లాగే! మీరెలా చెయ్యమంటే అల్లాగ చెయ్యటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను...సరే! 23వ తేదీ అని ఉంచేశాను..." అని రెట్టించాడు. రామనాథం,

"ఫరవాలేదండీ! అయినా మనలో మనకి ఈరాత కోతలన్నీ ఎందుకుచెప్పండి? ఏదో వ్యవహారం కదా అని వ్రాసుకోవటంగాని?...." అంటూనే రామనాథం వ్రాసిన నోటు అందుకున్నాడు, గోపాలం.

"అవుననుకోండి! అయినా సొమ్ముతో పనిచూడండి! వ్యవహారం వ్యవహారంలాగ చేసుకుంటేనే స్నేహాలు శాశ్వతంగా ఉండిపోతాయి....మీ సొమ్ము వీలయినంత త్వరగా ఇచ్చేస్తాను. వడ్డీతో సహా! సమయానికి ఆదుకున్నారు - మీరు గనక. మీ ఋణం తీర్చుకోలేను! మీ రివందా ఊరికే ఇచ్చినట్టుగానే భావిస్తాను..." అంటూనే వడ్డీ మినహాయించుకుని గోపాలం యిచ్చిన సొమ్మును అందుకున్నాడు కృతజ్ఞతతో - రామనాథం.

రామనాథం వెళ్ళిన తరువాత గోపాలం ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. అసలు రామనాథం ఇలా సొమ్ము కావాలంటూ ఎందుకు వచ్చాడన్నది దురూహ్యమయిపోయింది రామనాథం స్వతహా బాగా డబ్బున్నవాడు. తనకంటె ఎక్కువ సొమ్మే వడ్డీలకు తిప్పుతున్నాడు పదిమంది అవసరాలూ అతను తీర్చటమే ఉంది. కాని, అతనికి అవసరం వచ్చిన సందర్భం ఇదివరకెన్నడూ తానెరుగడు. ఒకవేళ అటువంటి అవసరం వచ్చినా తనవద్దకు వస్తాడని



కలలోకూడా అనుకునే అవకాశం లేదు. అందుకనే అంతగా ఆలోచించాడు గోపాలం. కాని చిట్టచివరకు మనస్సును సరిపెట్టుకున్నాడు. అతడు తనదగ్గరకు ఎందుకు వస్తేనేం? నోటు వ్రాసియిచ్చాడు. సాక్షి సంతకాలు వగైరాలతో సహా అన్నీ కట్టుదిట్టంగా వ్రాయించి పుచ్చుకుని, వడ్డీ మినహాయించుకుని మరీ యిచ్చాడు సొమ్ము. ఇంక తనకేం భయం? ఇలా అనుకున్నాక మనస్సుకు ఊరట కలిగిందతనికి.

ఇలా కొంతకాలం గడిచింది. కొద్ది రోజుల్లోనే సొమ్ము ఇచ్చేస్తానన్న రామనాథం తిరిగి ఆ విషయమే స్మరించలేదు. ఆలస్యమైనకొద్దీ వడ్డీ మరికాస్త పెరుగుతుందనే ఆశతో కాలక్షేపం చేశాడు గోపాలం.

కాని ఎంతకాలానికీ సొమ్మిచ్చేప్రయత్నం రామనాథం చెయ్యకపోయేసరికి గోపాలానికి ఖంగారుపుట్టి రామనాథం వద్దకు వెళ్ళాడొకనాడు.

రామనాథంకూడా గోపాలానికి చాలా మర్యాదచేశాడు. అనేక విషయాలు ప్రసంగిస్తాడుగాని ఈ బాకీమాట రామనాథం ఎంతకూ తలబెట్టకపోయేసరికి ఉండబట్టలేక గోపాలమే అన్నాడు: "మీకు అవసరమంటే అప్పుడు సర్దాను. ఇప్పుడు నాకు అవసరమొచ్చింది. అందుచేత ఆ సొమ్ము సర్దుతారేమోనని...."

"ఏ సొమ్ము? మీ రనేదేమిటో నాకు అర్థం కావటంలేదు...." అన్నాడు రామనాథం తొణక్కుండా, బెణక్కుండా.

"అదే! అవాళ నా దగ్గర తీసుకున్న పదివేల బాపతు....ఈ నోటు తాలూకు...." అని నోటుకూడా చూపించాడు గోపాలం,

"ఇదేదో తమాషాగానే ఉందే! నేను మీ దగ్గర డబ్బెప్పుడు తీసుకున్నాను? నోటెప్పుడు వ్రాశాను? అసలు నాకటువంటి అవసరమే రాలేదే?" అన్నాడు రామనాథం తాపీగా.

"మరి ఈ నోటు మాటేమంటారు?" అని అడిగాడు. ఇటువంటి జవాబు చెప్తాడని యెదురుచూడని గోపాలం,

"ఏమో? నాకేం తెలుసు?...." నిర్లిప్తంగానే అన్నాడు రామనాథం.

గోపాలానికి ఉడుకుమోతుతనం, కోపం పెరిగాయి. "అయితే అయినకాడికి సొమ్మంతా తీసుకెళ్ళి, ఇవాళ లేదంటావుటయ్యా? అన్నాడు.

రామనాథం ప్రశాంతంగా, "మీరు అనవసరంగా ఆవేశపడుతున్నారు. ఇందులో నేను అబద్ధమాడినదేమీలేదు. నేను మీవద్ద ఎన్నడూ సొమ్ము పుచ్చుకోలేదు. అమాటే చెప్పాను. అంతే! ..." అన్నాడు.

"ఏదీ! ఈనోటు చూసి చెప్పు. అదే మాట!" అని రోషంగా అడిగాడు గోపాలం.

రామనాథం నోటుకేసి చూసి, "ఇదే సృష్టిలో విచిత్రం. మనిషిని పోలిన మనిషి, రాతని పోలినరాత ఉంటాయి నావ్రాతలాగే ఉంది. అంతవరకూ నిజమే! కాని సరిగ్గా నా వ్రాతలాగే వ్రాయించగలిగిన మిమ్మల్ని వ్రాయగలిగిన ఆ పెద్దమనిషిని నిజంగా అభినందించాలి!...." అన్నాడు.

"ఇంతకీ మీ రనేదేమిటి?"

"ఇందాకనే చెప్పానుగా!"

"ఇంత అన్యాయమా? ఇంత నమ్మకద్రోహమా? అసలు సొమ్మే పుచ్చుకోలేదంటున్నారు-ఇదేమైనా బాగుందా? ఇది న్యాయమా?"

"అదే నేనూ అడుగుతున్నాను. లేనిపోని అప్పులు నా మెడకి చుట్టటం మీకు న్యాయమా అని?"

ఇంక కోపాన్ని ఆపుకోలేక పోయాడు గోపాలం. "అయితే సరే! ఈ కబుర్లేమిటో కోర్టులో చెపుదురుగాని; నేనూ చూస్తాను. ఆహాఁ! నా దగ్గరా ఇవన్నీను" అని రుసరుసలాడాడు.

రామనాథం మాత్రం స్తిమితంగానే అన్నాడు: "అలా అన్నారు-బాగుంది. ఎప్పటికేనా నిజానిజాలు తేలవలసినది అక్కడే కదా! కాని మీ శ్రేయోభిలాషిని గనక ఒక్కమాట! మీ శ్రేయస్సుకోరి చెప్తున్నాను. కోర్టుల కెక్కితే ఖర్చులు దండగతప్ప ప్రయోజన ముండదు. అంచేత అనవసరంగా తొందరపడి నష్టపోవద్దని నాసలహా!...." అన్నాడు.

"చాల్చాల్లేవయ్యా! నీ సలహా ఎవరికి కావాలి? బోడి సలహా నువ్వూను ..." అని లేచి చక్కా పోయాడు గోపాలం. తాను సీరియస్‌గా మాట్లాడుతున్నకొద్దీ రామనాథం చల్లచల్లగా తాపీగా మాట్లాడితే చిర్రెత్తు కొచ్చింది - గోపాలానికి.

అక్కడనుంచి వెళ్లాక అన్నంతపనీ చేసి తీరాడు గోపాలం. కోర్టు కెక్కించి చెవులు మెలేసి మరీ తనసొమ్ము రామనాథం చేత కక్కించాలని గోపాలం కోరిక. కాని రామనాథం మాత్రం కోర్టు కు రమ్మని కాగితం వచ్చిన నాడుకూడా కంగారు పడ లేదు. సరికదా కోర్టులోకూడా అంత తాపీ గానే జవాబు చెప్పాడు.

"ఏమయ్యా! గోపాలంగారి దగ్గర నువ్వు సొమ్మేమైనా అప్పు తెచ్చావా?...." అని జడ్జీ అడిగితే. "లేదండి!" అని బదులు చెప్పాడు.

"మరి ఈనోటు!...."

"నాకు తెలీదండి!...."

"ఈ దస్తూరీ!...."

"నాది కాదండీ!"

"నీ దస్తూరీ ఇలాగే ఉందే!"

"అవునండి! నా దస్తూరీలాగే ఉంది. ఎవరు వ్రాశారోగాని!"

"అయితే ఇది నీది కాదంటావ్!"

"కాదండి!"

"మరి సాక్షి వ్రాలు చేసినవాళ్ళుకూడా నువ్వే వ్రాసి యిచ్చావంటున్నారే!"

"అనొచ్చండి! ఈ నోటే సృష్టించిన వాళ్ళకి. ఇటువంటి సాక్ష్యాలు తేవటం కష్ట మాండి?"

"మరి నువ్వు చెప్పేదానికి సాక్ష్యం?"

"ఉందండి! ఏలినవారు చిత్తగిస్తానంటే మనవి చేస్తాను ..."

"చెప్పు!"

"ఈ నోటు జనవరి 23 న వ్రాసినట్టుంది కాదండీ?"

"అవును!"

"అపలా జనవరి 23న నేనిక్కడ లేనేలే నండి!...."

"మరెక్కడున్నావు ...?"

"చిత్తం! హైకోర్టులో సాక్ష్యం చెప్ప టానికని హైదరాబాదు వెళ్ళానండి! ఏలిన వారీ కాగితాలు చిత్తగిస్తే నిజం తమకే తెలుస్తుంది!...." అని కాగితాలు కొన్ని అందించాడు.

వాటినిబట్టి జనవరి 23 న రామనాథం గ్రామంలో లేడని, హైదరాబాదు వెళ్ళి హైకోర్టులో ఏదో కేసులో సాక్ష్యమిచ్చా డని రుజువయిపోయింది.

గోపాలం నెత్తీ, నోరు బాదుకున్నాడు. ఆనాడు తేదీ వెయ్యటం దగ్గర జరిగిన కథ యావత్తూ చెప్పాడు. రుజువు చెయ్య బోయాడు. కాని అదంతా అరణ్యరోదన మైంది. కేసుకొట్టేశారు.

"రామనాథం అక్కట్టినుండి వెళ్ళిపోయే ముందు కోర్టువారితో "అయ్యా! ఒక్క మనవి! డబ్బు అంటే ఆశఉండటం సహజం! మిత్రులు గోపాలంగారు ఏదో పొరపాటున ఈ పని చేశారు. నోటూ, అవీ సృష్టించారు. కాని ఇది ప్రథమ తప్పిదంగా భావించి. ఏలినవారు వారిని విడిచిపెట్టాలని నా ప్రార్థన" అని చెప్పి మరీ వెళ్లాడు.

అందరూ అతని ఔదార్యాన్ని పొగిడారు. ఏదీ వినిపించటం, కనిపించటం, అర్థంకావటం మానేసి అయోమయ స్థితిలోవున్న గోపాలం మాత్రం నిశ్చేష్టుడై అలాగే ఉండిపోయాడు.

000

జ్యోతి





వస్తోంది! వస్తోంది!!

కన్నుల పండుగ, మనసుకు విందుగ

"జ్యోతి" దీపావళి సంచిక

ఇంపైన కథలు, సొంపైన చిత్రాలు,

చక్కని వ్యాసాలు, గేయాలు,

ఇంకా ఎన్నో ప్రత్యేకాకర్షణలతో

నవంబరు "జ్యోతి"

దీపావళి సంచికగా

వెలువడుతుంది.

ప్రకటనకర్తలకు మహదవకాశం

MECHANICAL DATA

| | | |
|---|---|---|
| Page area | ... | 26 x 22 cms. |
| Printed page area | ... | 22 x 18 cms. |
| Half page area | ... | 11 x 18 cms. |
| Screen | ... | 65 |

RATES

| | | |
|---|---|---|
| Opening page | ... | Rs. 200 |
| Ord. Inside page | ... | Rs. 150 |
| Half page | ... | Rs. 80 |
| 4th cover (single colour) | ... | Rs. 300 |